క్లుప్తంగా

దోషులను కఠినంగా శిక్షించాలి



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఎజాజ్ అహ్మద్ మృతికి కారకులైన దోషులను కఠినంగా శిక్షించాలని వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్‌సుభాని డిమాండ్ చేశారు. ఆదివారం దుగ్గిరాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాయచోటిలోని కొత్తపల్లిలో జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడుని తర గతి గదిలోనే.. అతి కిరాతకంగా దాడిచేసి కొట్టి హత్య చేయడం సభ్య సమాజం తలదించు కోవాల్సిన అంశమన్నారు. ఇలాంటి ఘటన జరగడం చాలా బాధాకరమని, ఎజాజ్ అహ్మద్ కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. త్వరితగిన పూర్తి స్థాయిలో న్యాయవిచారణ జరిపి ప్రభుత్వం నిజానిజాలను వెలికి తీయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఈ విషయమై విద్యాశాఖమంత్రి నారా లోకేష్ స్వయంగా జోక్యం చేసుకోవాలని కోరుతున్నామన్నారు.

మెగా ఉచిత వైద్య శిబిరం



తాడికొండ: శ్రేష్ఠ ఆసుపత్రి సౌజన్యంతో తాడికొండ నార్త్ పాఠశాలలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి గ్రామస్తుల నుంచి మంచి స్పందన లభించింది. పలువురు వైద్య శిబిరంలో పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకోగా దీర్ఘకాలిక రోగాలైన షుగరు, బీపీ, థైరాయిడ్, కీళ్ళ నొప్పులు వంటి పలు సమస్యలున్న వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. బండ్ల కోటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరానికి టీడీపీ నాయకులు వాసిరెడ్డి జయరామయ్య ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించగా పలువురు గ్రామస్తులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వాకర్స్ ఆధ్వర్యంలో ప్రముఖులకు సన్మానం



మంగళగిరి: వాకర్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని పలు పదవులు సాధించిన ప్రముఖులను సన్మానించారు. ఆదివారం ఉదయం టెంపుల్ హిల్ ఏకో పార్కులో ఘనంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఏపీ ఎంబీసీడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, పద్మశాలీయ కార్పొరేషన్ డైరెక్టర్ నందం అబద్దయ్య, టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవిని సత్కర్కించారు. ఈ కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అసోషియేషన్ ప్రతినిధులు వీసం వెంకటేశ్వరరావు, సంకా బాలాజీ గుప్తా పాల్గొన్నారు.

ముగిసిన సుబ్రహ్మణ్యస్వామి బ్రహ్మోత్సవాలు



తెనాలి రూరల్: తెనాలి మండలం పెదరావూరులోని మహావిద్యా పీఠంలో నిర్వహిస్తున్న జగద్గురు ఆదిశంకరాచార్య సహిత అభయ హస్త సుబ్రహ్మణ్యస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. విద్యాపీఠం వ్యవస్థాపకుడు చింతపల్లి సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో ఈ నెల 4న ప్రారంభమైన బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా ఉదయం 11.30 గంటలకు పూర్ణాహుతి అవబృదం నిర్వహించారు. కార్యక్రమాలను చింతపల్లి దత్తు శర్మ, శుభం శర్మ, రామకృష్ణ, నరసింహమూర్తి శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం స్వామికి మహా హారతి, భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో స్వామి భక్తులు, శ్రీ మహా విద్యాపీఠం కార్యవర్గం సభ్యులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

కొల్లిపర: మండల కేంద్రం కొల్లిపరలో రహస్యంగా పేకాడుతున్న ఆరుగురిని ఆదివారం అదుపులోకి వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.కోటేశ్వరరావు తెలిపారు. వారి నుంచి రూ.6540 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. మండలంలో ఎక్కడైనా అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే ప్రజలు స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని ఆయన కోరారు.

ట్రినిటి లూథరన్ చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకలు

నగరంపాలెం: స్థానిక కొత్తపేట కుగ్లర్ ఆస్పత్రి ఆవరణలోని ట్రినిటి లూథరన్ చర్చిలో ఆదివారం సెమీ క్రిస్మస్ నిర్వహించారు. రెవ. డా.సిహెచ్ డానియేల్‌కుమార్ క్రిస్మస్ సందేశాన్ని అందించారు. క్రీస్తు జననం అనే నాటికను బాలబాలికలు ప్రదర్శించగా, కేక్ కట్ చేశారు. సంఘ కాపరులు రెవ.జె.దైవాశీర్వాదం ,రెవ.పి.రమేష్ ప్రజల కొరకు ప్రార్థనలు చేశారు.బ్రదర్ ఎస్.మార్టిన్‌లూథర్‌కింగ్, బత్తుల లెనిన్, బి.గ్రేస్‌సుదర్శనం పాల్గొన్నారు.

అవగాహన లేకుంటే అనర్థమే



మిరప పంటలో మందు స్ప్రే చేస్తున్న రైతు

మేడికొండూరు: వ్యవసాయంలో పురుగు మందుల వినియోగం బాగా పెరిగిపోయింది. రైతులు పంటపై ఎక్కువ మోతాదులో రసాయన ఎరువులు విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు. ఫలితంగా పంటల దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ప్రస్తుతం పత్తి, మినుము, పసుపు, పెసర, మిరప, మొక్క జొన్న పంటల్లో పురుగు ఉధృతి అధికంగా ఉంది. నాలుగు రోజులకోసారి ఖరీదైన పురుగు మందులను రైతులు పిచికారి చేస్తున్నారు. కలుపు నివారణకూ పురుగు మందులు వాడుతున్నారు. మందుల పిచికారి విషయంలో జాగ్రత్తలు పాటించాలని వైద్యులు చెబుతున్నారు.

పరుగు మందు పిచికారీలో జాగ్రత్తలు ఇలా..

- చేతులు గ్లౌజులు, ముక్కు, నోటికి అడ్డంగా మాస్క్ పెట్టుకోవాలి.
- ఎదురుగాలికి మందును పిచికారి చేయకూడదు.
- పిచికారి సమయంలో సిగరెట్లు, బీడీలు వంటివి కాల్చకూడదు.
- చేతులు శుభ్రం చేసుకోకుండా కళ్ల, నోరు, ముక్కు, మొహాన్ని రుద్దు కూడదు.
- మందు పిచికారి తరువాత దుస్తులు శుభ్రంగా ఉతుక్కోవాలి
- రసాయన ప్రభావానికి లోనైతే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి
- పురుగు మందుల డబ్బాలు, సీసాలను కాల్వలు, చెరువుల్లో వేయకూడదు.
- స్ప్రేయర్ల నాణ్యత బాగుండాలి. ఎటువంటి లీకేజీ లేకుండా చూసుకోవాలి.
- పిచికారి సమయంలో నాజిల్ సమస్య వస్తే నోటితో ఊదడం మంచిది కాదు.
- మందు డబ్బాపై ఉన్న లేబుల్ సూచనల ప్రకారం మందులు కలుపుకోవాలి.
- భోజనానికి ముందు చేతులు శుభ్రంగా కడుక్కోవాలి.

జాగ్రత్తలు తప్పనిసరి



క్రిమి సంహారక మందులు పిచికారి సమయంలో రైతులు జాగ్రత్తలు పాటించాలి. చేతులకు గ్లౌజులు, మొహానికి మాస్కులు లేకుండా మందు స్ప్రే చేయకూడదు. పంటలపై సరైన మోతాదు మాత్రమే క్రిమి సంహారక మందులను వినియోగించాలి. లేకుంటే పంట దెబ్బతినే అవకాశం ఉంది.

– ఎం.నాగరాజు, ఏఓ, మేడికొండూరు

ఏమిటీ.. అలా కొట్టేశారా..!



చోరీ జరిగిన టీ స్టాల్

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పోలీస్ స్టేషన్ ఎదురుగా మెయిన్ రోడ్డులోని ఓ టీ స్టాల్‌కు ఇద్దరు మహిళలు వచ్చి ఒకరు దుకాణదారుడిని మాటల్లో పెట్టగా, మరొకరు దొంగతనం చేసిన ఘటన ఆలస్యంగా ఆదివారం వెలుగులోకి వచ్చింది. సేకరించిన వివరాల మేరకు.. శివపార్వతి టీ స్టాల్‌కు ఇద్దరు మహిళలు టీ కావాలని వచ్చారు. దుకాణదారుడు మధు టీ కాచే పనిలో ఉండగా.. ఓ మహిళ వాటర్ బాటిల్ తీసుకుంటున్నట్లు షాప్ లోపలకు వెళ్లి కౌంటర్‌లో ఉన్న రూ.15 వేల నగదుతో పాటు మరో రూ.15 వేల విలువైన సెల్‌ఫోన్ తీసుకుంది. వెంటనే తమకు టీ వద్దు అంటూ ఆ ఇద్దరూ అక్కడి నుంచి వెళ్లిపోయారు. అనంతరం చోరీ జరిగిందని తెలుసుకున్న టీ స్టాల్ యజమాని మధు తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

మస్జిద్-ఎ-అర్కమ్ హుదా మసీదు ప్రారంభం



మాట్లాడుతున్న మౌలానా షేక్ ముస్తాఖ్ అహ్మద్

తెనాలి: పట్టణ బుర్రిపాలెంరోడ్డులోని బీసీ కాలనీలో ఆదివారం మస్జిద్-ఎ-అర్కమ్ హుదా పేరుతో నూతన మసీదును ప్రారంభించారు. మౌలానా మసూద్ ఆధ్వర్యంలో తొలి నమాజు చదివారు. రాష్ట్ర ఇమానే కమిటీ, హుదా సొసైటీ సంయుక్త పర్యవేక్షణలో దాతల సహకారంతో ఈ మసీదును నిర్మించారు. ప్రారంభ సభకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా షేక్ ముస్తాఖ్ అహ్మద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రతిఒక్కరూ అల్లా మార్గంలో నడుస్తూ జీవితాన్ని సార్థకం చేసుకోవాలని ఆయన సూచించారు. మనిషి జీవితం క్షణభంగురమనీ, శ్వాస పీల్చుకుని విడిచేలోపు జీవితం ఉంటుందో లేదో అగమ్యగోచరమని చెప్పారు. అందువల్ల అల్లాను స్మరిస్తూ సన్మార్గంలో నడుస్తూ, ఆదర్శవంతమైన జీవితాన్ని గడపాలని తెలిపారు. హుదా సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు హజరత్ మౌలానా మొహమ్మద్ అబ్బాస్‌ఖాన్ నద్వీ మాట్లాడుతూ దయ, కరుణ, నైతికవిలువలతో జీవితాన్ని గడపాలనీ, అంతా సోదరభావంతో ఐకమత్యంతో జీవిస్తూ ప్రపంచశాంతికి కృషిచేయాలని చెప్పారు. రాష్ట్ర ఇమానే మజ్లీస్ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ ఫరీద్, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ మొహమ్మద్ ఇస్మాయిల్, సిరాజుద్దీన్, షేక్ సత్తార్, అతావుల్లా, హాఫీజ్ అబ్దుల్ కరీం, ముఫ్తీ ముజాహిద్, వినుకొండ కౌన్సిలర్ ఎంఎస్‌కే బాషా పాల్గొన్నారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడికి ఆత్మీయ సత్కారం



మృత్యుంజయరావు దంపతులకు సత్కారం

తెనాలి: రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డును ఇటీవల స్వీకరించిన పి.మృత్యుంజయరావు(జయ మాస్టారు)కు ఆదివారం సాయంత్రం తెనాలిలో ఆత్మీయ సత్కారం చేశారు. స్థానిక గంగానమ్మపేటలోని చారిత్రక ప్రసిద్ధి చెందిన శ్రీపర్వతవర్ధినీ సమేత శ్రీరామేశ్వరస్వామి దేవాలయం ప్రాంగణంలో ఏర్పాటైన సభకు ఉపాధ్యాయ సంఘం 'ఆపస్' బాపట్ల జిల్లా అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసకుమార్ అధ్యక్షత వహించారు. ఆదిశైవ సంఘం, తెనాలి ఆధ్వర్యంలో జరిగిన సభకు ప్రముఖ శైవాగమ పండితుడు మామిళ్లపల్లి మృత్యుంజయ ప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఉపాధ్యాయ ప్రముఖుడైన మృత్యుంజయరావు విద్యార్థులను తీర్చిదిద్దుతూ, మండల, జిల్లా, రాష్ట్రస్థాయి రిసోర్స్‌పర్సన్‌గా పనిచేస్తూ వందల మంది ఉపాధ్యాయులకూ శిక్షణనిచ్చారని వక్తలు అభినందించారు. గత 22 ఏళ్లుగా హోమియో ఉచిత సేవాకేంద్రాన్ని నిర్వహిస్తూ వేలాదిమందికి ఆరోగ్య సేవలను అందించటం గొప్ప విషయమని ప్రశంసించారు. జయ మాస్టారు గతంలో రోటరీ క్లబ్, బ్రాహ్మణ పరిషత్ అవార్డులతోపాటు నియోజకవర్గ, జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అందుకున్నారని వక్తలు గుర్తుచేశారు. స్వర్ణ హరికృష్ణ స్వాగతం పలికిన సభకు ఎన్.చిరంజీవి వందన సమర్పణ చేశారు.

బాలబాలికలకు చిత్రలేఖన పోటీలు

నగరంపాలెం: స్థానిక సంపత్‌నగర్ శ్రీరామనామ క్షేత్రం ఆవరణలో 98వ శ్రీరామకోటి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయ ప్రాంగణంలో బాలబాలికలకు వార్షిక కంఠ పాట, చిత్రలేఖనం, భక్తి పాటల పోటీలు జరిగాయి. కార్యనిర్వాహకులు రాగం వెంకట లీలాసుందరి, మస్తాన్‌రావు దంపతుల ఆధ్వర్యంలో పాలక మండలి సభ్యులు సుబ్బారావు, బి.జయశంకర్, బి.రామకృష్ణలు పోటీలను పర్యవేక్షించారు. రాగం వెంకట లీలాసుందరి మాట్లాడుతూ పోటీల్లో విజేతలకు ఈనెల 19న సంఘ వార్షిక సభలో బహుమతులు అందిస్తామని చెప్పారు. పాఠశాలల నుంచి బాలబాలికలకు యోగదా చారిటబుల్ ట్రస్ట్ తరుపున ప్రసాదాలు, భగవద్గీత పుస్తకాలు పంపిణీ చేశారు.

12వ వేతన సవరణ కమిటీని నియమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న చాంద్‌బాషా

గుంటూరు మెడికల్: ప్రభుత్వం 12వ వేతన సవరణ కమిషన్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు చాంద్ బాషా కోరారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం(ఏపీజీఈఏ) గుంటూరు జిల్లా కార్యవర్గ సమావేశం గుంటూరు వైద్య కళాశాలలోని సంఘ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. చాంద్ బాషా మాట్లాడుతూ ఇప్పటికే 11వ వేతన సవరణ కమిటీ ముగిసి 18 నెలలు అయినట్లు చెప్పారు. ఇప్పటి వరకు ప్రభుత్వం పీఆర్సీ కమిటీని ప్రకటించకపోవడం పోవడం శోచనీయమని పేర్కొన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు ఐఆర్ 28 శాతం వెంటనే ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించాల్సిన పెండింగ్ బకాయిలను తక్షణమే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లాలోని ఏడు తాలూకా యూనిట్‌ల అధ్యక్ష, కార్యదర్శులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, మహిళా విభాగం కార్యవర్గ సభ్యులు అందరూ పాల్గొని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. సమావేశంలో జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కరిముల్లా షా ఖాదరి, జిల్లా కోశాధికారి పోతురాజు, జిల్లా ఉపాధ్యక్షులు మురళీకృష్ణ, రహిమాన్, జిల్లా సంయుక్త కార్యదర్శి కోట సాహెబ్, శ్రీనివాసరావు, నగరశాఖ అధ్యక్షులు నాగేశ్వరరావు, కార్యదర్శి సాంబశివరెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలు హేమలత, కార్యదర్శి సుమిత్రా దేవి, గ్రామ, వార్డు సచివాలయం ఉద్యోగుల సంఘం నాయకులు భరత్ కుమార్, హిదయతుల్లా పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా సిద్ధం

ఫిరంగిపురం: పట్టభద్రుల ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితా స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అందుబాటులో ఉంచినట్లు తహసీల్దార్ జె.ప్రసాదరావు ఆదివారం తెలిపారు. జాబితాను పట్టభద్రులు పరిశీలించుకొని, తప్పొప్పులు, సవరణ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇప్పటి వరకు ఓటు కోసం దరఖాస్తు చేసుకోని వారు తహసీల్దార్ కార్యాలయంలో అర్జీ అందజేయాలని సూచించారు.

ఓటు దరఖాస్తుకు నేడు చివరి అవకాశం

తెనాలి రూరల్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునేందుకు సోమవారం చివరి అవకాశమని అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2021 నవంబరు ఒకటో తేదీలోపు డిగ్రీ పట్టా కలిగిన వారు ఫారం- 18తో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో ఓటరు జాబితా అందుబాటులో ఉందని, పరిశీలించుకుని అభ్యంతరాలను ఫారం -7 ద్వారా తెలియజేయవచ్చని తెలిపారు.

ప్రభుత్వ నియంత్రణ నుంచి ఆలయాలకు విముక్తి కల్పించాలి

తెనాలి: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జనవరి 5న జరగనున్న హైందవ శంఖారావం సభకు తెనాలి నుంచి ప్రజలు భారీగా తరలిరావాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. స్థానిక రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ కార్యాలయంలో ఆదివారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఆర్‌ఎస్‌ఎస్ తెనాలి నగర సంఘ చాలక్ ఇల్లూరు సత్యనారాయణ అధ్యక్షత వహించారు. హిందూ చైతన్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి మారుతీరామ్ మాట్లాడుతూ దేవాలయాలను ప్రభుత్వ నియంత్రణ నుంచి విముక్తం చేసి, స్వయం ప్రతిపత్తి కలిగిన ఉత్తమ ధార్మిక వ్యవస్థకు అప్పగిస్తూ వెంటనే చట్టసవరణ చేయాలనీ విశ్వహిందూ పరిషత్ జాతీయోద్యమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఇందులో భాగంగానే జనవరి 5న విజయవాడలో గన్నవరం విమానాశ్రయానికి దగ్గర్లో లక్షలాది మందితో బహిరంగసభ జరగనుందని తెలిపారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు రెడ్డి వెంకటప్పారెడ్డి, నగర కార్యదర్శి రామాంజనేయులు, ఆర్‌ఎస్‌ఎస్ నగర కార్యనిర్వాహక త్రిపురమల్లు హనుమత్‌ప్రసాద్, బీజేపీ, న్యాయవాద పరిషత్, బీఎంఎస్, విద్యాభారతి, ఏబీవీపీ, రాష్ట్ర సేవికా సమితి, హిందూ చైతన్య వేదిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లీడర్‌షిప్ శిక్షణ తరగతులు వాయిదా వేయాలి

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు సోమవారం నుంచి ఈనెల 19 వరకు నిర్వహించతలపెట్టిన ఎఫ్ఎల్ఎన్, లీడర్‌షిప్ ట్రైనింగ్ కార్యక్రమాలను వాయిదా వేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు డి.పెదబాబు పేర్కొన్నారు. ఆదివారం కంకరగుంటలోని ఎస్టీయూ భవన్‌లో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో పెదబాబు మాట్లాడుతూ ఎస్ఏ-1 పరీక్షలు సోమవారం నుంచి జరగనుండగా, సరిగ్గా ఇదే సమయంలో శిక్షణ కార్యక్రమాలను చేపట్టడం తగదని తెలిపారు. ఏకోపాధ్యాయ పాఠశాలలతో పాటు ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల నుంచి ప్రధానోపాధ్యాయులను శిక్షణ తరగతులకు హాజరు కావడం కష్టతరంగా ఉండే దృష్ట్యా, శిక్షణ తరగతులను వాయిదా వేయాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి డీకే సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఒకేసారి పరీక్షలు, శిక్షణ నిర్వహించడం కష్టతరమవుతుందని తెలిపారు. ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలన్నారు.

చర్మ వ్యాధులను నిర్లక్ష్యం చేయకూడదు

గుంటూరు మెడికల్: దీర్ఘకాల మధుమేహం, అధిక రక్తపోటు బాధితులలో రోగ నిరోధక శక్తి తక్కువగా ఉండటం వలన అనేక సూక్ష్మజీవ చర్మవ్యాధులు ఎక్కువగా వస్తాయని వాటిని నిర్లక్ష్యం చేయకూడదని డాక్టర్ డి.అమర్ అన్నారు. బ్రాడీపేటలోని ఎస్‌హెచ్‌ఓ భవనంలో సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. డాక్టర్ అమర్ మాట్లాడుతూ మధుమేహ బాధితులు స్వేచ్ఛగా అన్ని రకాల ఆహారాలు తీసుకోకపోవడం, వివిధ రకాల మధుమేహ, రక్త పోటు మందులు వాడటం, వివిధ రకాల క్రీములువాడడం, వయసు కారణంగా రోగ నిరోధక శక్తి తగ్గిపోవడం జరుగుతుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ చర్మం పరిరక్షణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, చర్మం లో ఏదైనా అసాధారణ మార్పులు కనిపిస్తే వెంటనే వైద్యుని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమానికి సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ టి.సేవకుమార్ అధ్యక్షత వహించారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ మెడికల్ క్యాంప్స్ చైర్మన్ టి.ధనుంజయ రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో దంత వైద్య నిపుణులు డాక్టర్ సిహెచ్.చైతన్య, ఎస్ హెచ్‌ఓ మేనేజర్ పి.నిర్మల రాణి, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు ఎస్.సాంబశివరావు, జి.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడి అమానుషం

- ఉప ముఖ్యమంత్రి బంగ్లాదేశ్ రావాలి
- విశ్వహిందూ పరిషత్ సభ్యులు



భరతమాత సెంటర్ నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న విశ్వహిందూ పరిషత్‌సభ్యులు

తాడేపల్లిరూరల్ : బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులు చాలా అమానుషమని, ఆ దేశంలో హిందువులపై, మహిళలపై చాలా దారుణంగా దాడిచేసి మారణకాండను సృష్టిస్తున్నారని, ప్రపంచ దేశాలు కలగజేసుకుని దాడులను ఆపాలని విశ్వహిందూ పరిషత్ నాయకులు కల్యాణ్ స్వామీజీ అన్నారు. ఆదివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని భరతమాత సెంటర్ నుంచి ఓల్డ్ టోల్ గేటు, అక్కడ నుంచి జాతీయ రహదారి వెంబడి కుంచనపల్లిలోని వెంకటేశ్వర స్వామి దేవాలయం వరకు హిందువులపై దాడులను నిరసిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కల్యాణ్ స్వామీజీ మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో నివసిస్తున్న హిందువులపై ముస్లింలు దాడులు ఆపకపోతే ఇండియాలో ఉన్న రొహింగ్యా ముస్లింలను వారి దేశానికి వెళ్లే వరకు తరిమి కొడతామని హెచ్చరించారు. బంగ్లాదేశ్‌లో హిందువుల పరిరక్షణకై పోరాడుతున్న చిన్మయదాసు అరెస్ట్‌పై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించడం చాలా మంచి పరిణామమన్నారు. పవన్ కల్యాణ్ మరో అడుగు ముందుకు వేసి బంగ్లాదేశ్ పర్యటించి హిందువులపై జరుగుతున్న దాడులను అడ్డుకోవాలని, బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను ప్రపంచ దేశాలకు తెలిసే విధంగా ప్రచారం నిర్వహించి, ఈ దాడులను అన్ని దేశాల వారు ఖండించాలన్నారు. వెంటనే దాడులను ఆపకపోతే విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఆందోళన నిర్వహించడంతో పాటు భవిష్యత్తులో ఇక్కడ ఉన్న రొహింగ్యా ముస్లింలను దేశం నుంచి తరిమి కొట్టేందుకు పునరుద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భాగ్యేశ్వరరావు, రామిరెడ్డి, చిరంజీవి, బాలు, మోదుగుల కోటిరెడ్డి, శుభశేఖర్, ఇప్పటం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులు పట్టుదలగా ఉద్యమాన్ని కొనసాగించాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు



కార్మికులతో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రామరావు

తాడేపల్లిరూరల్ : ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు తమ నష్టపరిహారం కోసం నిర్వహిస్తున్న దీక్షలను పట్టుదలగా కొనసాగించాలని జిల్లా కార్యదర్శి పాశం రామరావు అన్నారు. ఆదివారం బ్రహ్మానందపురంలో కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ కార్మికులను చర్చలకు పిలవడం మంచి పరిణామమమని, అయితే ప్రజా దర్బార్‌లో ఇది తేలే సమస్య కాదన్నారు. ప్రత్యేకంగా మంత్రి నారా లోకేష్ చొరవ చూపించి కార్మికుల సమస్యను పరిష్కరించాలని కోరుతున్నామన్నారు. దీక్షా శిబిరంలో దామవరపు నాగేశ్వరరావు, వై. సాంబయ్య, ఆర్.ఇశ్రాయెల్, ఎ.నాగేశ్వరరావు, ఎస్కె ఆరిఫ్, సీఐటీయూ కార్యదర్శి వేముల దుర్గారావు, బి.వెంకటేశ్వర్లు, ఏఐఎఫ్‌టీయూ నాయకులు కె.కోటయ్య, కె.ఆదినారాయణ, కార్మిక నాయకులు కె.స్టీవెన్, అంకయ్య, ఎం.ఆశీర్వాదం, రమాదేవి, శారద, దుర్గాభవాని, బాషా పాల్గొన్నారు.

ఉత్తమ కమ్యూనిస్టు గాదె సుబ్బారెడ్డి

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు పుణ్యవతి



మాట్లాడుతున్న పుణ్యవతి

తాడేపల్లిరూరల్ : చివరి శ్వాస వరకు ఎర్ర జెండా కింద నిలిచి, కళా రంగంలో విశిష్ట సేవలందించిన గాదె సుబ్బారెడ్డి ఉత్తమ కమ్యూనిస్టుగా నిలిచారని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.పుణ్యవతి అన్నారు. ప్రజానాట్య మండలి రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాదె సుబ్బారెడ్డి సంస్మరణ సభను ఆదివారం సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.రవి అధ్యక్షతన సీఎస్ఆర్ కల్యాణ మండపంలో నిర్వహించారు. గాదె సుబ్బారెడ్డి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పుణ్యవతి మాట్లాడుతూ ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో పార్టీ ఆదేశాల మేరకు బాధ్యతలను త్రికరణ శుద్ధిగా నెరవేర్చేవారని, ప్రజా నాట్యమండలి రాష్ట్ర నాయకుడిగా అనేక కళారూపాలను తీర్చిదిద్దడంలో ఆయన కృషి ఎనలేనిదన్నారు. మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో బాలోత్సవాలు, పిల్లల్లో విజ్ఞాన సముపార్జనకు అనేక కళారూపాలను సృష్టించారన్నారు. సీపీఎం పూర్వ రాష్ట్ర కార్యదర్శి పి.మధు మాట్లాడుతూ సుబ్బారెడ్డి మరణం ప్రజాతంత్ర ఉద్యమానికి, సాంస్కృతిక రంగానికి తీరని లోటని అన్నారు. ఈ కార్యక్రమంలో సుబ్బారెడ్డి సతీమణి శివలీల, కుమార్తెలు శిరీష, ఆషాదేవి, కృష్ణాజిల్లా మాజీ ఎంఎల్‌సి వై.వి.బి. రాజేంద్రప్రసాద్, ప్రజా నాట్యమండలి తెలంగాణ రాష్ట్ర నాయకులు పి.దేవేంద్ర, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం, ప్రముఖ సినీ నటులు అజయ్ ఘోష్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, ప్రజా నాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి ఎస్. అనిల్ కుమార్, వివిధ ప్రాంతాల కళా రంగంలో పనిచేస్తున్న వారు, శ్రీకాంత్‌రెడ్డి, శివనాగేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు సాహితీవేత్తలకు 'తెలుగు తేజం' పురస్కారం



భీమేశ్వరప్రసాద్‌కు సత్కారం

తెనాలి/ తెనాలి రూరల్ : ప్రకాశం జిల్లా మార్కాపురం పట్టణంలోని గొల్ల సత్యనారాయణ కల్యాణ మండంలో ఆదివారం జరిగిన ఆదరణ వెల్ఫేర్ సొసైటీ దశమ వార్షికోత్సవ సభలో తెనాలికి చెందిన ప్రముఖ పద్యకవి, సాహితీవేత్త విష్ణుమొలకల భీమేశ్వర ప్రసాద్, మండలంలోని కొలకలూరుకు చెందిన సాహితీరత్న నూతక్కి పూర్ణప్రజ్ఞాచారికి తెలుగు తేజం జాతీయ పురస్కారం ప్రదానం చేశారు. దుశ్శాలువ, జ్ఞాపిక, ప్రశంసా పత్రంతో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు గొట్టిముక్కల చెన్నకేశవులు, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఎ.నాగేశ్వరరావు, కార్యక్రమ సంధానకర్త ధనాశి ఉషారాణి, డాక్టర్ రంగిసెట్టి రమేష్ సమక్షంలో పురస్కారాలను ప్రదానం చేశారు. తొలిగా 'మాతృభాష పరిరక్షణ–కవుల కర్తవ్యం' అంశంపై కవి సమ్మేళనం నిర్వహించారు.

గుంటూరు ఘాట్ టాలెంట్ షో ప్రారంభం



గుంటూరు మెడికల్: సలాం నమస్తే గుంటూరు సొసైటీ ఫౌండర్ డాక్టర్ షేక్ షమా సుల్తానా ఆధ్వర్యంలో గుంటూరు పొన్నూరు రోడ్డులోని ఎం కన్వెన్షన్ హాల్లో గుంటూరు ఘాట్ టాలెంట్ షో కాంపిటేషన్స్, పాటలు, డ్యాన్స్, స్టాండ్ అప్ కామెడీ, మ్యాజిక్ షో, మ్యూజికల్ ఇన్‌స్ట్రుమెంట్స్, ఫ్యాషన్ షో, మెహందీ, పోయిట్రీ, ఫన్నీ ఆర్ మెసేజ్ ఓరియంటెడ్ స్కిట్ లాంటి పోటీలను ఆదివారం ప్రారంభించారు. సలాం నమస్తే గుంటూరు సొసైటీ ఫౌండర్ డాక్టర్ షమ సుల్తానా మాట్లాడుతూ గుంటూరు ఘాట్ టాలెంట్ షో కాంపిటేషన్స్ పూర్తయిందన్నారు. ఈనెల 15 సెమీ ఫైనల్స్, ఈనెల 22న ఫైనల్స్ ఉంటాయని తెలిపారు. ఈనెల 26న ఎస్ఎన్‌జీఎస్ ఇనాగ్రేషన్, జీజీటీ అవార్డ్స్ అండ్ కల్చరల్ నైట్ విజ్ఞాన మందిరంలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. గుంటూరు ఘాట్ టాలెంట్ షో సర్టిఫికెట్స్, మెడల్స్‌ను అందజేయడం జరిగిందన్నారు. సెమీఫైనల్స్, ఫైనల్స్ పోటీలో పాల్గొంటున్న ప్రతి ఒక్కరికి ఆల్ ది బెస్ట్ తెలిపారు. కార్యక్రమంలో షేక్ కరీం, డాక్టర్ సారిక, డాక్టర్ వహీద్, అనిల్ ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ ప్రెసిడెంట్, కో హోస్ట్ రజాక్, అల్లాబక్షు, మేనేజర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.